సాక్షి సంగారెడ్డి

మంగళవారం ౹ 10 ౹ జూన్ ౹ 2025



ఇక అంగన్‌వాడీ బాట

నేటి నుంచి ఈనెల 17వ తేదీ వరకు 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట' పేరుతో వారోత్సవాలు నిర్వహించనున్నారు. వివరాలు 8లో ▸



ఇసుక ఎంత అవసరం?

అభివృద్ధి పనులకు సంబంధించి ఇసుక అవసరాలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. వివరాలు 8లో ▸

టీపీసీసీ కార్యవర్గంలో ఐదుగురికి చోటు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: టీపీసీసీ కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఐదుగురు నాయకులకు చోటు లభించింది. టీపీసీసీ ఉపాధ్యక్షులుగా గాలి అనిల్ కుమార్, చిన్నపట్ల సంగమేశ్వర్, ఎం.ఏ ఫయిమ్ నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా తోపాజి అనంతకిషన్, గిరిజ షెట్కార్, శశికళారెడ్డిలకు చోటు దక్కింది.

న్యూస్‌రీల్

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి


సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నాడు. ఇటీవల సదాశివపేటకు చెందిన ఓ కేన్సర్ పేషెంట్‌కు రూ. 10 లక్షలు అందజేసిన జగ్గారెడ్డి సోమవారం మరో కేన్సర్ బాధితురాలికి రూ. నాలుగు లక్షల ఆర్థిక సాయం చేశారు. సంగారెడ్డి పట్టణంలోని సోమేశ్వరవాడకు చెందిన రాణమ్మ కూరగాయలు విక్రయించి జీవనం కొనసాగిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని రాణమ్మకు బ్రెస్ట్ కేన్సర్ సోకింది. చికిత్స కోసం రూ. లక్షలు ఖర్చు కావడంతో బాధిత కుటుంబం ఆర్థికంగా చితికి పోయింది. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జగ్గారెడ్డి ఈ మేరకు ఆర్థిక సాయం అందజేశారు. తన నియోజకవర్గంలో కేన్సర్‌తో బాధపడే నిరుపేదలకు చికిత్స కోసం ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు పంపిణీ చేయండి

మెదక్ కలెక్టరేట్: ఈనెల 25వ తేదీ లోపు బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓ) గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు 1,500 వరకు ఓటర్లు ఉంటే ఒక పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశామని, ప్రస్తుతం 1,200 లోపు ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు కొత్తగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలతో కూడిన ప్రతిపాదనల జాబితాను ఈనెల 20వ తేదీ లోపు పంపించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలసాహిత్యం ఎంతో అవసరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చిట్టిపొట్టి పదాల కూర్పుతో, తేనేలూరు గేయ మధురిమల మేళవింపు కలిగిన బాలగేయాలు బాలల లోకంలో విహరిస్తాయని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్నవెళ్లి రాజమౌళి అన్నారు. మన బాల సాహిత్యం కార్యక్రమంలో భాగంగా నల్గొండకు చెందిన ప్రముఖ కవి కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన "ఊగుతున్న ఉయ్యాల బాల గేయాలు" పుస్తకాన్ని సిద్దిపేటలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ నేడు బాలలకు బాలసాహిత్యం ఎంతో అవసరమన్నారు. కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి బాలసాహిత్యంలో చేస్తున్న కృషి అమోఘమన్నారు. బాలలకు బాలసాహిత్య పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. బాలసాహిత్యం సమాజ శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం, గాయకులు వరుకోలు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



సింగూరు డ్యాం

సింగూరు వరద జోరు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు సోమవారం వరద పోటెత్తింది. మహారాష్ట్రలోని లాతూర్‌లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 7,896 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. డ్యాంలోకి ఈ సీజన్‌లో ఇప్పటివరకు 1.5 టీఎంసీల నీరు చేరింది. సీజన్ ప్రారంభంలోనే డ్యాంలోకి వరదలు వస్తుండటంతో అధికారులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 18.482 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు ఆయకట్టు కాలువ సిమెంట్ లైనింగ్ చేస్తుండటంతో ఏడాది నుంచి క్రాప్ హాలీడే ప్రకటించారు. దీంతో ఈ నీరంతా మిషన్ భగీరథ తాగునీటి పథకానికే కేటాయించారు. దీంతో జంట నగరాల తాగునీరు, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాల తాగునీటికి కేటాయిస్తున్నారు. ప్రతి రోజు మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, హెచ్‌ఎండీఏకు 80 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

బఫర్ స్టాక్ రావాల్సిందే!

- 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం
- ప్రస్తుతం 9,200 మెట్రిక్ టన్నుల నిల్వలు
- ఇంకా తెప్పిస్తామంటున్న అధికారులు
- ఖరీఫ్ అవసరాలకు 38 వేల మెట్రిక్ టన్నులు

ప్రైవేట్ డీలర్లు కృత్రిమంగా కొరత సృష్టించకుండా.. రైతుల అవసరాల మేరకు ఎరువులను సరఫరా చేయడానికి.. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా వ్యవసాయశాఖ ఎరువులను బఫర్ స్టాక్ మెయింటెన్ చేస్తుంది. ఎక్కడైనా ఎరువుల కొరత తలెత్తితే ఈ స్టాక్ నుంచి విడుదల చేసి సమస్య తీవ్ర రూపం దాల్చకుండా ముందు జాగ్రత్త పడుతుంది.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

జిల్లాలో ఈ ఎరువుల బఫర్ స్టాక్ ప్రస్తుతానికి అంతంత మాత్రంగానే ఉన్నాయి. యూరియా ఎరువులనే ఉదాహరణగా తీసుకుంటే.. కనీసం జిల్లా సాగు విస్తీర్ణాన్ని బట్టి కనీసం 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ నిల్వలు చేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతానికి 9,200 మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలున్నట్లు ఆశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. సాధారణంగా జిల్లాలో ఎరువుల సరఫరా బాధ్యతలు మార్క్‌ఫెడ్ (తెలంగాణ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్) చూసుకుంటుంది. వ్యవసాయశాఖ ఇచ్చిన ఇండెంట్ మేరకు ఆయా మండలాలకు ఎరువులను సరఫరా చేస్తుంది. బఫర్ స్టాక్‌ను మెయింటెన్ చేసే బాధ్యతను కూడా ఈ మార్క్‌ఫెడ్ చూసుకుంటుంది. అయితే ఈ మార్క్‌ఫెడ్ వద్ద ప్రస్తుతానికి 9,200 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. ఇంకా సుమారు 5,800 మెట్రిక్ టన్నుల యూరియా తక్కువ ఉన్నట్లు.



ఇంకా తెప్పిస్తున్నాం

ఈ సీజన్‌లో జిల్లా సాగు అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి కొరత తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు ఎంతైతే బఫర్ స్టాక్ ఉండాలో అంత మేరకు ఎరువుల నిల్వలు తెప్పించి పెడుతున్నాం. ఇంకా ఎరువులు వస్తున్నాయి. వ్యవసాయశాఖ ఇచ్చే ఇండెంట్ మేరకు అన్ని మండలాలకు ఎరువులను సరఫరా చేస్తున్నాం. ఈసారి కాస్త ముందస్తుగా వర్షాలు పడ్డాయి.

– శ్రీదేవి, మార్క్‌ఫెడ్ డీఎం

ముందస్తు సీజన్‌తో..

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 8.04 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం సుమారు 38 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని గుర్తించారు. అలాగే 16 వేలు మెట్రిక్ టన్నులు డీఏపీ, మరో 36 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరం ఉంటాయి. ఈసారి తొలకరి ముందస్తుగా పలకరించడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు దున్నుకుని విత్తనాలు వేసుకుంటున్నారు. ఇప్పటికే 33 వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు వేసుకున్నారు. జొన్న, మొక్కజొన్న విత్తనాలు విత్తుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పెసర వంటి పంటలు విత్తుకుంటున్నారు. వరికి కాస్త సమయం ఉన్నప్పటికీ మిగిలిన పంటల సాగు షురువైంది. ఈ నేపథ్యంలో ఎరువుల అవసరాలు ఉంటాయి.

ముందస్తుగా స్పందించకపోతే తిప్పలే..

జిల్లాలో సాగు అవసరాల మేరకు ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా మిర్గమ తర్వాత పంటల సాగు ఊపందుకుంటుంది. లోగా సాగు అవసరాల మేరకు ఎరువులను తెప్పించడంతో పాటు, బఫర్ స్టాక్ నిల్వలు కూడా సంవృద్ధిగా ఉంచాల్సిన అవసరం ఉంటుంది. అసలే జిల్లాకు రైల్వే రేక్ పాయింట్ లేదు. పక్క జిల్లాల్లో ఉన్న రేక్ పాయింట్ల నుంచి ఎరువులను రవాణా చేసుకోవాల్సి ఉంటుంది. సనత్‌నగర్ రేక్ పాయింట్ నుంచి జిల్లాకు ఎక్కువగా ఎరువుల సరఫరా అవుతుంటాయి. అలాగే మెదక్, గజ్వేల్, తిమ్మాపూర్ (మహబూబ్‌నగర్) రేక్ పాయింట్ల నుంచి కూడా జిల్లాకు ఎరువుల సరఫరా అవుతుంటాయి. రేక్ పాయింట్ ఉంటే తొందరగా ఎరువులు జిల్లాకు చేరుకుంటాయి. కానీ ఈ పాయింట్ జిల్లాలో లేకపోతే కొరత ఏర్పడితే వెంటనే తెప్పించుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్‌బంక్‌లో సోమవారం ట్రయల్ సేల్ నిర్వహించగా.. సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులతో కలిసి పరిశీలించారు. తన వాహనంలో డీజిల్ పోయించుకొని డబ్బులను అందించారు. పెట్రోల్ బంక్ నిర్వహణతో పాటు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్ ద్వారా ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. నిర్వహణ ద్వారా వచ్చే లాభంతో ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ జ్యోతి, అదనపు డీఆర్డీఓ జంగారెడ్డి, ఐఓసీఎల్ ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రజావాణికి 61 దరఖాస్తులు

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ మేరకు 61 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు వాపోయారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ట్రాన్స్‌కో అధికారులతో ఎంపీ సురేష్ షెట్కార్ సమీక్ష

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ డివిజన్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఎంపీ సురేష్ షెట్కార్ ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపుతూ నాణ్యమైన కరెంట్‌ను అందించడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ట్రాన్స్‌కో అధికారులు గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా రైతులకు నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్య ఉంటే గుర్తించి పరిష్కరించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున ప్రమాదాలు చోటు చేసుకొకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. సమావేశంలో ట్రాన్స్‌కో జనరల్ మేనేజర్ కామేష్, ఎస్‌ఈ శ్రీనాథ్, డీఈఈ, ఏడీ, ఏఈలు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, పలు మండలాల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రావు పాటిల్, నర్సింహారెడ్డి, కండెం నర్సింలు, నాయకులు శుక్లవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్దిలింగయ్య స్వామిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

'ఉపాధి' పనులు బాధ్యతగా చేపట్టాలి

నిజాంపేట(మెదక్): పేదలకు ఉపాధి కల్పించాలనే ఆలోచనతో చేపడుతున్న ఉపాధి హామీ పనులను అధికారులు సిబ్బంది బాధ్యతాయుతంగా నిర్వహించాలని అడిషనల్ పీడీ రంగాచారి, డీపీఓ శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 2024- 25 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ముందుగా గ్రామాల వారీగా జరిగిన ఉపాధి పనులను గుర్తించి వాటి లోటుపాట్లపై సిబ్బందిని వివరణ కోరారు. అనంతరం చేపట్టిన పనుల్లో మస్టర్లలో సంతకాలు లేకపోవడం, ఒకరికి బదులు మరొకరు పనులు చేయడం, హరితహారంలో నాటిన మొక్కలు చనిపోవడంపై కార్యదర్శులు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు కలిపి రూ. 8 వేల జరిమానా విధించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏడాదిలో ఉపాధి పనులకు సంబంధించిన కూలీలు మెటీరియల్ కలిపి మొత్తం రూ. 3 కోట్ల 37 లక్షల పని జరిగిందని, దీనికి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారిణి అరుణ, జిల్లా కార్యాలయ అధికారి రాజేందర్, అసిస్టెంట్ డీపీఓ సంపత్, ఏపీఓ ఎంపీడీఓ ఎంపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శోభారాణి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు తమ పంటలకు మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడొద్దని నత్నయపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శోభారాణి తెలిపారు. సోమవారం మండలంలోని కంచన్‌పల్లిలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అధిక మోతాదులో రసాయనాలు వాడటం వల్ల భూమి పాడవుతుందని చెప్పారు. వ్యవసాయ అధికారుల సిఫారసు మేరకు భూసార పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వాడాలన్నారు. కేవలం వరిపైనే అధారపడకుండా మొక్కజొన్న, కూరగాయలు, పప్పు దినుసులు, నూనె గింజలు ఇతర పంటలు సాగు చేయాలన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలన్నారు. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. సాగులో ఖర్చులు తగ్గించుకొని ఆధునిక పద్ధతులు అవలంభించి అధిక ఆధాయం పొందాలని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఈఏసీ సభ్యురాలు లక్ష్మి, శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్‌రావు, ఏఓ స్వప్న, ఏఈఓ సాహితి రైతులు పాల్గొన్నారు.

సర్దుబాటు.. గ్రహపాటు

ఉపాధ్యాయులకు సర్దుబాటు ఉత్తర్వులు

- తాత్కాలిక ప్రాతిపదికన టీచర్ల డిప్యూటేషన్
- ఖేడ్ ప్రాంతానికి అన్యాయం!
- జహీరాబాద్, ఆందోల్ ప్రాంతాలకూ కొంత నష్టమే
- జిల్లా కేంద్ర సమీపాలకు వెళ్లనున్న ఉపాధ్యాయులు
- బడిబాట సాగుతుండగానే ప్రక్రియ



నారాయణఖేడ్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు పాఠశాలల విద్యాశాఖ చేపడుతున్న సర్దుబాటు ప్రక్రియ జిల్లాలోని మారుమూల గ్రామాలు, పాఠశాలలకు గ్రహపాటుగా మారనుంది. టీచర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి తక్కువ టీచర్లు ఉన్న సమీప పాఠశాలలకు సర్దుబాటు చేసేందుకు అవకాశం కల్పించారు. తాత్కాలిక బదిలీలు, డిప్యూటేషన్ పద్ధతుల్లో సర్దుబాటు చేసుకునేలా ఆదేశాలు జారీ అయ్యాయి. గతేడాది ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడంలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీలు జరిగాయి. కాగా, కొన్ని చోట్ల విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా సరిపడా ఉపాధ్యాయులు లేరని సర్దుబాటు ప్రక్రియ చేపడుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యావలంటీర్ల అవసరాన్ని తగ్గించి అందుబాటులో ఉన్న ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకొనేందుకు సర్దుబాటు ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అయితే బయటకిది బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా మారు మూల గ్రామాల నుంచి ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపించే అవకాశముంది. వెళ్లిన టీచర్ల స్థానే కొత్త ఉపాధ్యాయులు వస్తే సరే..కానీ, రాకుంటే మాత్రం ఆయా గ్రామాల్లో విద్యార్థులకు నష్టం చేకూరే అవకాశమూ లేకపోలేదని వాదనలు వినిపిస్తున్నాయి.

నిష్పత్తి ఇలా..

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పదిలోపు విద్యార్థులు ఉంటే ఒక టీచర్, 11 నుంచి 6–మంది ఉంటే ఇద్దరు, 61- 90మంది పిల్లలకు ముగ్గురు, 91- 120 మధ్య ఉంటే నలుగురు, 121-150 మంది ఉంటే ఐదుగురు, 151-200మధ్య విద్యార్థులకు ఆరుగురు టీచర్లు ఉండాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని టీచర్లను మైదాన ప్రాతాలకు పంపొద్దని, ఏజెన్సీ ప్రాంతాల్లో తగినంతమంది టీచర్లు లేకపోతే మైదాన ప్రాంతాల నుంచి డిప్యూటేషన్ వేయాలని నిబంధనలు చెబుతున్నాయి. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 862, ప్రాథమికోన్నత పాఠశాలలు 191, ఉన్నత పాఠశాలలు 206 ఉండగా ఇదులో ఎస్‌జీటీలు 2,692మంది, స్కూల్ అసిస్టెంట్ 2,681మంది విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా మొత్తంలో 6,013మంది ఉపాధ్యాయ పోస్టులకు గాను 5,373మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు నష్టమేనా?

పాఠశాలలు ఈనెల 12న పునఃప్రారంభం అవుతున్నాయి. కాగా, ఈ సర్దుబాటు ప్రక్రియ చేపట్టి ఈనెల 13న ఉపాధ్యాయులు సదరు పాఠశాలలో రిపోర్టు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఈనెల 6 నుంచి 19వరకు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టింది. బడిబాటతోపాటు ఈనెలాఖరు వరకు విద్యార్థులు బడుల్లో చేరుతుంటారు. అంటే విద్యార్థుల సంఖ్య ఈ నెలాఖరు తర్వాత ఏ తరగతిలో ఎందరున్నారో తేలిపోతుంది. మండల యూనిట్‌గా కాకుండా జిల్లా యూనిట్‌గా తీసుకుని 13వరకు సర్దుబాటు చేసి సదరు ఉపాధ్యాయుడిని కేటాయించిన పాఠశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఖేడ్ నియోజకవర్గం వెనుకబాటుగా ఉండటంతో పాటు, జహీరాబాద్, ఆందోల్ నియోకవర్గాల్లోని న్యాల్‌కల్, రాయికోడ్, ఝరాసంఘం మండలాలు మారుమూలగా ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి ఉపాధ్యాయులు జిల్లా యూనిట్ అయినందున సంగారెడ్డి, పటాన్‌చెరు లాంటి పట్టణ ప్రాంతాలకు వెళ్లిపోయే అవకాశం ఉంది. బడిబాటలో విద్యార్థుల సంఖ్య పెంచుకున్నా వెళ్లిపోయిన ఉపాధ్యాయుడు తిరిగి రాకపోగా కొత్తగా ఉపాధ్యాయులను నియమించే అవకాశం లేదు. ఫలితంగా వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులు లేక ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లడం లేదా బడిమానడం చేసే ప్రమాదం ఉంది. గతేడాది 170మంది వరకు ఉపాధ్యాయులు ఇలాగే అక్రమంగా డిప్యూటేషన్లు వేసుకున్నారని, ఇందులో అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులపై కలెక్టర్ డిప్యూటేషన్లను రద్దు చేశారు. ఖేడ్‌లోని ఓ తండా ఉపాధ్యాయుడు ఆందోల్ నియోజకవర్గంలోని సంగారెడ్డికి సమీపంలో ఉన్న పాఠశాలకు డిప్యూటేషన్ వేసుకోగా అక్కడి నుంచి ఓ ఉపాధ్యాయులు ఖేడ్ ప్రాంతానికి డిప్యూటేషన్ వేయించుకున్నారు. ఇది విద్యార్థుల ప్రయోజనమా లేక ఉపాధ్యాయులకు ప్రయోజనమా అనే చర్చ వచ్చింది. ఈసారి కూడా సర్దుబాటు కారణంగా ఖేడ్ నియోజకవర్గంతోపాటు జహీరాబాద్, అందోల్ నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు నష్టదాయకంగా మారనుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్కడ ఉద్యోగం.. ఇక్కడ జీతం

- 21 మంది సిబ్బందిలో 10 మంది డిప్యూటేషన్‌పై ఇతర చోట్ల విధులు
- ఏళ్ల తరబడి డిప్యూటేషన్..
- సిబ్బంది కొరతతో సేవల్లో జాప్యంపై ప్రజల ఆగ్రహం

వట్‌పల్లి(అందోల్): ములిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది వట్‌పల్లి తహసీల్దారు కార్యాలయం. విభజనలో భాగంగా 2016లో 15 గ్రామ పంచాయితీలతో వట్‌పల్లి నూతన మండలంగా ఏర్పాటైంది. సిబ్బందిని నియమించి తహసీల్దారు కార్యాలయాన్ని ప్రారంభించిన నాటి నుంచి ఏనాడు పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించకపోవడంతో అరకొర సిబ్బందితో సేవలు అందిస్తున్నారు. దీంతో సకాలంలో పనులు జరగక మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం 21 మంది సిబ్బందిని నియమించినప్పటికీ 10 మంది డిప్యూటేషన్‌పై ఇతరచోట్ల పనిచేస్తున్నారు. దీంతో మండలంలోని 22 గ్రామ పంచాయితీలు, 19రెవెన్యూ గ్రామాలు ఉండి మండలంలోని రెవెన్యూ పరంగా సేవలందిస్తున్న వట్‌పల్లి తహసీల్దారు కార్యాలయానికి సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది. ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు, రేషన్‌కార్డులు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు, భూ రిజిస్ట్రేషన్లు తదితర వాటికోసం నిత్యం వందలమంది దరఖాస్తుదారులు కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. వారం రోజుల్లో అందాల్సిన కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలు నెల రోజులైనా అందడంలేదు. మండలంలోని మర్వెల్లి గ్రామానికి చిలపల్లి వినయ్‌కుమార్ ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకోగా నాలుగు నెలలైన ధ్రువీకరణ పత్రం అందలేదని తెలిసింది. వారం రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సేవలు అందించడం ఎలా అనేది ప్రస్తుతం ఉన్న సిబ్బందికి భారంగా మారనుంది.



వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం

సగం మంది డిప్యూటేషన్లే...

వట్‌పల్లి తహసీల్దారు కార్యాలయానికి 21 మంది ఉద్యోగులను ప్రభుత్వం కేటాయించగా వారిలో 10 మంది ఉద్యోగ సిబ్బందిలో కొందరూ తమకు అనుకూలమైన ప్రదేశానికి డిప్యూటేషన్ వేయించుకోగా, మరి కొందరు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్డీఓ, కలెక్టరేట్ కార్యాలయాల్లో డిప్యూటేషన్‌పై వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ హత్నూర తహసీల్దారు కార్యాలయానికి, ఇద్దరు ఆర్‌ఐలలో ఒకరు అందోలు ఆర్డీ కార్యాలయంలో, ఒకరు కలెక్టరేట్‌లో, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లలో ఒకరు మునిపల్లి, మరొకరు చౌటాకూర్ మండలాల తహసీల్దారు కార్యాలయాల్లో, ఇంకొకరు కలెక్టరేట్ కార్యాలయంలో, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లలో ఒకరు చౌటాకూర్ మండల తహసీల్దారు కార్యాలయంలో, మరొకరు ఆర్డీఓ కార్యాలయంలో, ఇద్దరు సబార్డినేటర్లు ఆర్డీఓ కార్యాలయంలో ఇలా సగం మంది సిబ్బంది డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఆర్‌ఐ చేయాల్సిన పనిని జూనియర్ అసిస్టెంట్ చేత పనిచేయిస్తున్నారు. ఇక్కడి నుంచి జీతం తీసుకుంటూ ఇతర చోట్ల పనిచేయడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో సేవలందించేందుకు కృషి



ప్రజలకు అందుబాటులో ఉండి కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. డిప్యూటేషన్లతో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ప్రజలకు రెవెన్యూ సేవలందడంలో జాప్యం జరగకుండా ఉండేందుకు కృషి చేస్తున్నాం.

– శ్రీనివాస్, తహసీల్దారు, వట్‌పల్లి

క్లుప్తంగా

గోవా మద్యం పట్టివేత

జహీరాబాద్ టౌన్: గోవాకు చెందిన మద్యాన్ని అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ చెక్‌పోస్టు సీఐ మల్లికార్జున్‌బాబు తెలిపారు. జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి(మాడ్గి) అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానావాజ్ ఆదేశాల మేరకు సోమవారం వాహనాల తనిఖీలు నిర్వహించామన్నారు. గోవా నుంచి వస్తున్న టూరిస్టు బస్సులు, కార్లను తనిఖీ చేయగా గోవాకు చెందిన 17 మద్యం బాటిళ్లు లభించాయని తెలిపారు. తనిఖీల్లో ఎస్‌టీఎఫ్,డీటీఎఫ్, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

సిద్దిపేటఅర్బన్: బైకును కారు ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన గాదగోని హనుమాగౌడ్(75) సిద్దిపేటలో ఉంటున్న తన కుమారుడి వద్దకు రావడానికి సోమవారం ఉదయం గ్రామంలోని బస్టాప్ వద్ద వేచి ఉన్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన పసుపునూరి రితిక్ తన బైకుపై సిద్దిపేటకు వస్తుండగా హనుమాగౌడ్ లిఫ్ట్ అడిగి ఎక్కాడు. ఈ క్రమంలో తడ్కపల్లి గ్రామం దాటిన తర్వాత సిద్దిపేట నుంచి వస్తున్న కారు వీరి బైకును ఢీకొట్టింది. దీంతో హనుమాగౌడ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బైకు నడిపిన రితిక్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

దుబ్బాకరూరల్: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందింది. ఈ సంఘటన దుబ్బాక మండలం బల్వంతాపూర్‌లో జరిగింది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం ప్రకారం.. రెడ్డబోయిన రాజేశం(42) గ్రామంలో కోళ్ల ఫారంతో పాటుగా వ్యవసాయం చేసుకుంటూ తన భార్య, పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాడు. కోళ్ల ఫారంలో కోడి పిల్లలు వస్తాయని ఇంట్లో చెప్పి ఆదివారం రాత్రి కోళ్ల ఫారం వద్దకు వెళ్లాడు. కోళ్ల ఫారంలో లైట్లు వేయగా అవి వెలగలేదు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా కాక పోవడంతో దానిని బాగు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంత సేపటికి ఇంటికి రాక పోవడంతో సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూసే సరికి ట్రాన్స్ ఫార్మర్ వద్ద మృతి చెంది ఉన్నాడు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మద్యం మత్తులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నాగ్సాన్పల్లి శివారులోని తూముకుంట చెరువులో చోటు చేసుకుంది. సీఐ మహేష్ గౌడ్ కథనం మేరకు.. నాగ్సాన్ పల్లికి చెందిన ఆకుల శ్రీకాంత్(34) వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8న సాయంత్రం గ్రామ శివారులో ఉన్న తూముకుంట చెరువులో చేపలను పెట్టేందుకు గ్రామానికి చెందిన పాలాడి ప్రకాష్‌తో కలిసి మద్యం మత్తులో వల తీసుకొని వెళ్లాడు. శ్రీకాంత్, మరో వ్యక్తి ప్రకాష్ ఇద్దరూ చెరువులోకి దిగి, వల వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తుగా కాలుజారి శ్రీకాంత్ నీటిలో పడిపోయాడు. వెంటనే తేరుకొని ప్రకాష్.. అతడిని వెంటనే బయటకు తీశాడు. అప్పటికే శ్రీకాంత్ మృతి చెందాడు.

సిద్దిపేటలో..

సిద్దిపేటఅర్బన్: చెరువులో నీట మునిగి యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన తోడేటి బాలు (30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనెల 6న స్థానిక చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలో మృతుడి ద్విచక్ర వాహనం కనిపించింది. అనుమానంతో కుటుంబ సభ్యులు చెరువు దగ్గర పరిశీలించగా మృతుడి దుస్తులు కనిపించాయి. చెరువులో వెతకగా విగతజీవిగా కనిపించాడు. మృతుడి తండ్రి చాలా కాలం క్రితమే మరణించగా తల్లి 22 రోజుల క్రితం మరణించింది. మృతుడికి సోదరుడు కనకయ్య ఉన్నాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ 18 లక్షలకు 2కుంటల స్థలం (సంగారెడ్డి) సంగారెడ్డి, ఇస్మాయిల్ ఖాన్ పేట (గౌడిచర్ల) నందు ఇండ్ల దగ్గరలో 242 గజాలు (2కుంటల)స్థలం అమ్మకానికి కలదు. 18 లక్షలకు మాత్రమే. ఫోన్: 9652858716, 8019191085 [HA-15923]

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మర్వాడి షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మాడబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783417]

BUSINESS OFFER

■ Need Monthly Returns? Get international Capital Market Trading, Profit sharing / Fixed profit Safe & Secure 9392151984 [SCA25004710]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇక అంగన్‌వాడీ బాట

10 నుంచి వారోత్సవాలు
- అమ్మ మాట–అంగన్‌వాడీ బాట
- చిన్నారులను ఆకర్షించేలా కార్యక్రమాలు
- కేంద్రాల బలోపేతంపై చర్యలు



నారాయణఖేడ్: ప్రభుత్వ పాఠశాలల తరహాలోనే అంగన్‌వాడీలను సైతం బలోపేతం చేసేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఈనెల 10వ తేదీ నుంచి వారం పాటు 17వ తేదీవరకు 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట' పేరుతో వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 10 నుంచి అంగన్‌వాడీ బడులను పూర్తిస్థాయిలో తెరవనున్నారు. గ్రామస్థాయిలో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతో విద్యాబోధనకు తోడు బాలింతలు, గర్భవతులకు పౌష్టికాహారం, సలహాలు, సూచనలు అందిస్తూ పలు కార్యక్రమాలతో అంగన్‌వాడీలు కొనసాగుతున్నాయి. జిల్లాలో నారాయణఖేడ్, జోగిపేట్, సదాశివపేట్, జహీరాబాద్, పటాన్‌చెరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి.

ఈ కేంద్రాలకు 1,04,106మంది ఆరేళ్లలోపు చిన్నారులు వస్తున్నారు. గర్భవతులు 10,557మంది, బాలింతలు 8,186మంది సౌకర్యాలు పొందుతున్నారు. కాగా, గ్రామస్థాయిలోని అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి స్థాయిలో బలోపేతం చేసే దిశగా ఆశాఖ చర్యలు చేపట్టింది. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు ప్రైవేట్ పాఠశాలల్లో కాకుండా అంగన్‌వాడీల్లో చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండాలంటూ ఇటీవల ఆశాఖ మంత్రి సీతక్క అంగవాడీల బలోపేతంపై నిర్వహించిన సమావేశాల్లో నొక్కి చెప్పారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా కేంద్రాలను తీర్చిదిద్దేందుకు ఫర్నీచర్, ఆట వస్తువులు, ప్రీ ప్రైమరీ విద్య, యూనిఫామ్స్ ఇచ్చే విషయాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. తల్లిదండ్రులకు కేంద్రాలపై పూర్తి నమ్మకం కలిగేలా చూడాలని శాఖ నిర్ణయించింది.

అక్షరజ్ఞానంతోపాటు వికాసం, ఉల్లాసం, పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్న విషయాన్ని ప్రజలకు వివరించనున్నారు. ఫొటోలు, వీడియోలతో ప్రచారం చేయనున్నారు. కేంద్రాల్లోనూ పలు వసతులు కల్పించడంతోపాటు పూర్తిస్థాయిలో వసతులు లేని కేంద్రాలను సమీపంలోని ప్రభుత్వ భవనాల్లోకి మార్చనున్నారు. ఇరుకు, అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న చోట ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం రూ.12లక్షల వ్యయంతో నిర్మించేందుకు కూడా చర్యలు చేపడుతున్నారు.



నారాయణఖేడ్: ప్రాథమిక పాఠశాలలకు వెళ్తున్న ఆరేళ్ల చిన్నారులకు ఇటీవల ఖేడ్‌లో ఉత్తీర్ణతా పత్రాలు అందిస్తున్న అధికారులు

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

ఈనెల 10న అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, పేరెంట్స్ గ్రూప్, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించనున్నారు. 11న మూడేళ్లపైబడ్డ చిన్నారులను గుర్తించి వారి నివాసాలను సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. పిల్లలను చేర్పేలా ప్రోత్సహించాలి. కేంద్రాల్లో ఐదేళ్లు దాటిన పిల్లలకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించి ప్రైమరీ స్కూళ్లలో చేర్పించాలి. 12, 13, 16న పోషన్ కిచెన్ గార్డెన్, పోషకాహార వివరాలను, స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలి. చైల్డ్ ఫ్రెండ్లీ వాతావరణం అంగన్‌వాడీల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. 17న కేంద్రాల్లో తల్లిదండ్రులు, గ్రామ పెద్దల సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించాలి. వారోత్సవాలు ప్రారంభం అయ్యేలోపు స్వచ్ఛ అంగన్‌వాడీ కార్యక్రమం కింద కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చైల్డ్ ఫ్రెండ్లీగా అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలి.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

అభినందించిన ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. కల్హేర్ గ్రామానికి చెందిన శ్రీనివాస గౌడ్ సంగారెడ్డిలోని మల్కాపూర్ చౌరస్తాలో బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం వచ్చాడు. సోమవారం తిరిగి ఇంటికి వెళ్లేందుకు సంగారెడ్డి చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బంగారు ఆభరణాలతో పాటు వస్తువులతో కలిగిన బ్యాగుతో ఆటోలో బయలుదేరాడు. బ్యాగును ఆటోలో మరిచి బస్టాండ్‌లోకి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఆటోలో ఉన్న బ్యాగును చూసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. తన బ్యాగ్ పోయిన విషయం తెలుసుకున్న బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. బ్యాగులో 12.5 తులాల బంగారంతో పాటు వస్తువులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్‌ను ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించి నగదు బహుమతిని అందించారు. అనంతరం బ్యాగును యజమానికి అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, పట్టణ సీఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్‌ను అభినందించి నగదు బహుమతి అందిస్తున్న ఎస్పీ పరితోష్. చిత్రంలో అదనపు ఎస్పీ సంజీవరావు సీఐ రమేష్

వంద శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) డిమాండ్

సంగారెడ్డి: నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో వంద శాతం ఫీజు రాయితీని కల్పించాలని టీయూడబ్ల్యూజేఐజే యూ) తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి కోరారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలో డీఈఓ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం సమర్పించారు. గతంలో కొందరు ప్రైవేటు విద్యాసంస్థల వారు డీఈవో ఉత్తర్వులను కూడా అమలు చేయలేదన్నారు. ఈసారి ప్రతి విద్యా సంస్థ వారు ఉత్తర్వులు కచ్చితంగా అమలు చేసే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం రాయితీని అందే విధంగా చూస్తామని డీఈవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడు మహమ్మద్ సిద్దీఖ్ ఫొటో జర్నలిస్టుల సంఘ నాయకుడు ఆరిఫ్, సీనియర్ జర్నలిస్టులు రవి, పరంజ్యోతి, నాగరాజుగౌడ్, శ్యాంసుందర్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

సిద్దిపేటపై సంగారెడ్డి జట్టు గెలుపు



సంగారెడ్డి ఏ జట్టు

సంగారెడ్డి క్రైమ్: సిద్దిపేటపై సంగారెడ్డి జట్టు విజయం సాధించింది. కొండాపురం మండలం చీమలదరి కొనాపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి ఏ జట్టు, సిద్దిపేట బి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సిద్దిపేట బి జట్టు మొదట బ్యాటింగ్ చేసి, నిర్ధారిత 40 ఓవర్లలో 22.5 ఓవర్‌లో 100 పరుగులకు ఆలౌట్ అయ్యింది. సంగారెడ్డి బౌలింగ్‌లో దీక్షిత్ 4, అంజి 4, వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి జట్టు 22.5 ఓవర్లలలో 3 వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసి విజయం సాధించింది. సంగారెడ్డి బ్యాటింగ్‌లో ప్రణీత్ రెడ్డి 40, వేదాంత్ 27 పరుగులతో నాట్ ఔట్‌గా రాణించారు. సంగారెడ్డి ఏ జట్టు ఐదు మ్యాచ్‌లలో ఒక ఓటమితో లీగ్‌లో మొదటి స్థానంలో ఉన్నది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేటకమాన్: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లపల్లి నరేష్ వ్యాపారం నిర్వహిస్తూ తన కుటుంబంతో కలిసి పట్టణంలోని టెలికాంనగర్ సాయిదీప్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. తమ బంధువుల వివాహం సందర్భంగా తమ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 6న ఊరెళ్లారు. తిరిగి సోమవారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చిందర వందరగా పడి ఉండటంతో పాటు ఇంట్లో దాచిన 9 గ్రాముల బంగారు వస్తువులు, రెండు తులాల వెండి చైన్‌తో పాటు రూ.10వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆల్ఫాజోలం పట్టివేత

నర్సాపూర్: నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట గ్రామంలో కల్లులో వినియోగించే ఆల్ఫాజోలం మత్తుమందును సోమవారం పట్టుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ తెలిపారు. తమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలలో భాగంగా గ్రామానికి చెందిన వెంకటేష్‌గౌడ్ ఇంట్లో తనిఖీలు చేయగా.. 205 గ్రాముల ఆల్ఫాజోలం దొరికిందని, దాని విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని చెప్పారు. అతనిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని, అతన్ని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు చెప్పారు.



నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

బాలికను తల్లికి అప్పగించిన పోలీసులు

నర్సాపూర్: తప్పి పోయిన బాలికను స్థానిక పోలీసులు వెతికి గంటలోపు తల్లికి అప్పగించారు. స్థానిక ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. నర్సాపూర్‌కు చెందిన కాట్రోత్ వసంత తన ఆరేళ్ల కూతురు అక్షిని సోమవారం కొట్టగా చిన్నారి ఇంటి నుంచి వెళ్లిపోయింది. చిన్నారి ఫొటోను పట్టణంలోని పలు వాట్సాప్ గ్రూపులలో పోస్టు చేయడంతోపాటు తమ బీట్ కానిస్టేబుళ్లు మోహన్, వెంకన్నలు బాలిక ఆచూకి గుర్తించి తీసుకువచ్చారని ఎస్‌ఐ చెప్పారు. చిన్నారి అక్షిని ఆమె తల్లి వసంతకు అప్పగించామని ఆయన వివరించారు.



బాలికను ఆమె తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

ఇసుక ఎంత అవసరం?

అభివృద్ధి పనులకు ఇసుక అవసరాలపై ప్రభుత్వం ఆరా
- అన్ని ఇంజనీరింగ్ శాఖల నుంచి ఇండెంట్ సేకరణ
- 11.75 లక్షల టన్నులు అవసరమన్న ఇరిగేషన్ శాఖ అధికారులు
- ఇసుక కొరతతో పనులు ఆగిపోవద్దని ముందస్తు ఏర్పాట్లు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : అభివృద్ధి పనులకు ఇసుక అవసరాలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఆయా ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఎంతమేరకు ఇసుక అవసరం ఉందనే దానిపై ఆయా ఇంజనీరింగ్ శాఖల నుంచి ఇండెంట్ తీసుకుంటోంది. నీటిపారుదల, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్..వంటి ప్రధాన ఇంజనీరింగ్‌శాఖలు తమ ఇసుక అవసరాలకు ఇండెంట్‌లను ఇప్పటికే పంపాయి. మిగిలిన శాఖల నుంచి కూడా ఈ ఇండెంట్ తీసుకుంటున్నారు. ఈ బాధ్యతలను భూగర్భ గనులశాఖకు అప్పగించారు. ఆయా పనులకు మొత్తం ఎంత ఇసుక అవసరం? జూన్ వరకు ఎంత అవసరం ఉంటుంది. సెప్టెంబర్ వరకు ఎంత..? డిసెంబర్ నాటికి ఎంత..? ఇలా ప్రతీ మూడు నెలలకు ఎంతెంత మొత్తంలో అవసరమని లెక్కలు తీస్తున్నారు.



పనులు ఆగిపోవద్దని..

పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. బిల్లులు రావనే భయంతో టెండరు దాఖలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. కొన్ని రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్ల నుంచి స్పందన రాకపోతే.. పదిసార్లు టెండరు నోటిఫికేషన్ ఇచ్చిన ఉదాహరణలున్నాయి. కాంట్రాక్టర్లు ముందుకొచ్చిన చోట ఇసుక లేదనే కారణంగా పనులు నిలిచిపోకూడదని ప్రభుత్వ ఇసుక సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. అలాగే రానున్నది వర్షాకాలం కావడంతో స్థానికంగా ఇసుక దొరకడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో ముందస్తుగా ఏర్పాటు చేసుకుంటే పనులకు ఆటంకం ఉండదని భావిస్తోంది.

బసవేశ్వరకు 4.12 లక్షల మెట్రిక్ టన్నులు

తమ శాఖ ద్వారా కొనసాగుతున్న పనులకు 11.75 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరమని నీటిపారుదలశాఖ ఇండెంట్ ఇచ్చింది. సింగూరు కాలువల ఆధునీకరణ పనులకు 2.12 లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక అవసరమని లెక్కతేల్చింది. అలాగే బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి 4.12 లక్షల మెట్రిక్ టన్నులు, కాళేశ్వరం ప్రాజెక్టు 17వ ప్యాకేజీకి 3.12 లక్షల మెట్రిక్ టన్నులు, సంగమేశ్వర ఎత్తిపోతలకు 1.08 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేశారు. చెరువుల నిర్మాణం, ఇతర పనులకు మిగిలిన మొత్తం అవసరమని నీటిపారుదలశాఖ ఇండెంట్ ఇచ్చింది.

పక్క జిల్లాలో టీజీఎండీసీ క్వారీలు

రాష్ట్రంలో టీజీఎండీసీ (రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ) ఇసుక సరఫరాకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ఈ సంస్థనే ఇసుక క్వారీలను నిర్వహిస్తోంది. ఈ క్వారీలు సంగారెడ్డి జిల్లాలో లేవు. దీంతో సమీపంలో ఉన్న కామారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, పెద్దపల్లి జిల్లాల్లో ఉన్న టీజీఎండీసీ క్వారీల నుంచి సరఫరా చేసే అవకాశాలున్నాయని భూగర్భగనుల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఇతర శాఖలు..

ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల్లో బ్రిడ్జిల నిర్మాణం, సీసీ రోడ్లు వంటి పనులకు ఇసుక అవసరం ఉంటుంది. ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి వాటికి ఇసుక తప్పనిసరి. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఒక్కో నియోజకవర్గాల్లో కొత్తగా 3,500 చొప్పున ఇండ్లు మంజూరు చేసింది. ఈ ఇండ్లకు కూడా ఇసుక అవసరం ఉంటుంది. ఇలా అన్ని ఇంజనీరింగ్ శాఖల నుంచి ఇసుక అవసరాలపై అంచనాలను సేకరిస్తున్నారు.

620 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం



ఎండు గంజాయితో పాటు నిందితులను పట్టుకున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మునిపల్లి(అందోల్): కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో 620 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, సంగారెడ్డి సిబ్బంది దిలీప్‌రెడ్డి, హనుమంతు, అనుదీప్ తెలిపారు. సోమవారం మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా బోడబండకు చెందిన అమీర్‌ఖాన్, సమీయొద్దీలు బీదర్ నుంచి వైట్ బేలానో కార్‌లో 620 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కారుతో పాటు 620 గ్రాముల ఎండు గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



వేముల లక్ష్మి (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆరోగ్య సమస్యలు తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల లక్ష్మి(49) వివాహిత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వివాహిత అదృశ్యం



రవళి (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనేపల్లి రవళి (24)కి వివాహం కాగా భర్త ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లడంతో తల్లిదండ్రులతో కలిసి సిద్దిపేటలోని మైత్రివనంలో ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం తల్లిదండ్రులు నిద్రలోనుండి లేచి చూసే సరికి కూతురు కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతకగా ఎక్కడ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తన కుమార్తె ఆచూకీ కోసం తండ్రి గోనేపల్లి తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

నిలిచి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న కారు

- కూతురు మృతి
- కొడుకు, తండ్రికి తీవ్ర గాయాలు
- తెల్లాపూర్ ఓఆర్ఆర్‌పై అర్ధరాత్రి ఘటన



ఘటనా స్థలం వద్ద నుజ్జునుజ్జయిన కారు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ స్వామిగౌడ్ కథనం ప్రకారం.. సిరిసిల్లకు చెందిన భిక్షపతి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ గండిపేటలో నివాసం ఉంటున్నాడు. కుట్టు మిషన్ శిక్షణ తీసుకునేందుకు ఆదివారం భార్య దీప్తికను కరీంనగర్‌లోని బంధువుల ఇంటి వద్ద వదిలిపెట్టాడు. అనంతరం కారులో కూతురు శ్రీవైష్ణిక(12), కుమారుడు సాంకేత్(14)లను తీసుకుని గండిపేటకు వస్తున్నాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటి గ్రామ శివారు ఓఆర్ఆర్‌పై అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో నిలిచి వున్న టిప్పర్‌ను ఢీకొట్టాడు. దీంతో కూతురు శ్రీవైష్ణిక అక్కడికక్కడే మృతి చెందింది. సాంకేత్, భిక్షపతికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీవైష్ణిక మృతదేహం

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్, నలుగురికి గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి నుంచి నర్సంపల్లి వైపు వెళుతున్న బైక్‌ను మట్టి ట్రాక్టర్ ఢీకొట్టడంతో భార్యాభర్తలు, ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నార్సింగి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం పోసన్పల్లికి చెందిన భార్యాభర్తలు అబ్రమైన అనిల్, రేణుక, ఇద్దరు చిన్నారులు రిత్విక్, నైనికతో కలిసి నార్సింగిలో ఆదివారం జరిగిన మల్లన్న పండుగకు వచ్చారు. సోమవారం ఉదయం సొంత గ్రామానికి బైక్‌పై వెళుతుండగా నార్సింగి శివారులోని ఆశోక్ పౌల్ట్రీఫామ్ సమీపంలో బైక్‌కు ఎదురుగా వచ్చిన మట్టి ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న నలుగురికి గాయాలు కాగా నార్సింగి మండల కేంద్రంలోని ప్రైవేట్ అస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన కారు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్–మెదక్ 765డి జాతీయ రహదారిలోని పెద్ద చింతకుంట వద్ద సోమవారం వేకువ జామున హైదరాబాద్‌కు చెందిన ఓ కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని వేగంగా ఢీకొట్టింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతుండగా పెద్ద చింతకుంట వద్ద రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం కారుపై పడటంతో ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న వారందరూ క్షేమంగా ఉన్నట్టు స్థానికులు తెలిపారు.



స్తంభం ధ్వంసమై కారుపై పడిన దృశ్యం

భార్యతో గొడవపడి..



గుంటుకు రాంచందర్

గజ్వేల్‌రూరల్: భార్యతో గొడవపడిన భర్త ఇంట్లో నుంచి వెళ్లిన ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన గుంటుకు రాంచందర్, సత్తవ్వ దంపతుల మధ్య ఈనెల 6న వాగ్వాదం జరిగింది. గతంలో పలుమార్లు గొడవపడి బయటకు వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో గొడవపడిన రాంచందర్ అదే రోజు సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరెంట్ కాటుకు గేదె బలి

పాపన్నపేట(మెదక్): విద్యుత్ తీగలు తెగి పడి గేదె మరణించింది. ఈ సంఘటన మండల పరిధిలోని పోంలా తండాలో సోమవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన మెగావత్ నరేశ్ ఇంట ఎదుట గేదెను కట్టేసి ఇంట్లో పడుకున్నాడు. తెల్లారి లేచి చూసే సరికి , ఇంటి ముందు నుండి వెళ్లే కరెంట్ తీగ తెగి, గేదెపై పడటంతో అది మృత్యువాత పడిందని తెలిపారు. దీని విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందన్నారు. విద్యుత్ అధికారులు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.